

'గురి' తప్పని పూర్ణచంద్

కొత్తరేగ గ్రామానికి చెందిన కిలపర్తి పూర్ణచంద్ 9వ తరగతి చదువుతూ ఆర్చరీ పోటీల్లో రాణిస్తున్నాడు.

- 12లో



టన్ను పీడీఎస్ బియ్యం పట్టివేత

విజయనగరం గుంకలాం నుంచి గొట్లాం బైపాస్ రోడ్డు మీదుగా తరలిస్తున్న టన్ను పీడీఎస్ బియ్యంను విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు.

- 12లో



ప్లకార్డుతో నిరసన

న్యూస్‌రీల్

3 కేంద్రాల్లో నేడు ఎడ్‌సెట్-2025

విజయనగరం అర్బన్: బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎడ్‌సెట్-2025ను జిల్లాలోని మూడు కేంద్రాల్లో గురువారం పరీక్ష నిర్వహించనున్నట్టు రీజనల్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 800 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారన్నారు. వీరికోసం సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఐయాన్ కేంద్రం, లెండి ఇంజినీరింగ్ కళాశాల, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల మధ్య పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి కనీసం ఒక గంట ముందు హాజరుకావాలని సూచించారు.

ఎస్‌జీటీల ఉద్యోగోన్నతి ప్రక్రియ ప్రారంభం

విజయనగరం అర్బన్: స్కూల్ అసిస్టెంట్ టీచర్ల ఉద్యోగోన్నతి పోస్టుల భర్తీ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్‌లను ఉద్యోగోన్నతితో భర్తీ చేస్తామని, ఇప్పటికే ఎస్జీటీల సీనియార్టీ తుది జాబితాను సిద్ధమం చేసినట్టు డీఈఓ మాణిక్యంనాయుడు తెలిపారు. కంటోన్మెంట్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

రేషన్ సరుకుల కోసం వెళ్లి మృత్యుఒడిలోకి...

- రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి



మృతిచెందిన విశ్వనాథం

రాజాం సిటీ: కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దుచేసి.. డిపోల వద్దనే రేషన్ తీసుకోవాలన్న సూచన మేరకు.. సరుకుల కోసం వెళ్లిన ఓ వ్యక్తిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. ఇంటి పెద్ద దిక్కు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విషాదకర ఘటన రాజాం పట్టణ పరిధి బొబ్బిలి రోడ్డులోని సిరి కల్యాణ మండపం వద్ద జరిగింది. ఈ నెల 3న మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన రాగోలు విశ్వనాథం (48) మల్లయ్యపేటలోని డిపో వద్దకు రేషన్ సరుకులు తీసుకునేందుకు సైకిల్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో బొబ్బిలి వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహన దారుడు సిరి కల్యాణమండపం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో విశ్వనాథం రోడ్డుపై పడిపోయాడు. తలకు, కాలికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో రాజాం, అక్కడ నుంచి శ్రీకాకుళం, అక్కడ నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ మృతిచెందినట్టు సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి



ప్రసాద్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

పెందుర్తి: తోటి కూలీలతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. పెందుర్తి మండలం ముదపాకలో ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ కె.వి.సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా తెర్లాంకి చెందిన పక్కి ప్రసాద్(25) ముదపాకలోని జగనన్న కాలనీలో నిర్మాణ పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి పనులు చేసిన తరువాత సమీపంలోని బావిలోకి తోటి ముగ్గురు నిర్మాణ కూలీలతో కలిసి ఈతకు వెళ్లాడు. మిగిలిన వారు వెళ్లిపోదాం అంటే 'నేను కాసేపు ఉండి వస్తాను' అని చెప్పడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రసాద్ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తోటి కూలీలు బావి వద్దకు వెళ్లారు. అక్కడ దుస్తులు ఉండడంతో ప్రసాద్ నీటిలో మునిగిపోయి ఉండవచ్చని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఆదేశాల మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ప్రసాద్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు జరుగుతుంది.



చీపురుపల్లి మెయిన్‌రోడ్డులో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సాగిన వెన్నుపోటు దినం ర్యాలీ

వెన్నుపోటుపై జనాగ్రహం!

- నమ్మి ఓటేసిన ప్రజలకు వెన్ను చూపారు..
- వంచన మీ నైజం.. మిమ్మల్ని ఎలా నమ్మేది జనం!
- కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం
- జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీలు
- వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు



రాజాం: వెన్నుపోటు దినం ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ తలే రాజేష్, కిల్లి సత్యనారాయణ, జగన్మోహనరావు తదితరులు

సాక్షి నెట్‌వర్క్: 'కూటమి ప్రభుత్వం ఏడాది పాలనంతా నయవంచన, ద్వేషం, కక్షపూరితం. నమ్మి ఓటేసిన ప్రజలకు వెన్నుపోటు పొడిచారు. సూపర్ సిక్స్ పథకాలని ఊదరగొట్టి.. ఉత్తచేయి చూపారు. అందుకే ఏడాదిలోనే కూటమి ప్రభుత్వాన్ని జనం ఛీ కొడుతున్నార'ని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. కూటమి ఏడాది పాలన.. ప్రజలకు చేసిన మోసంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా 'వెన్నుపోటు దినం' నిర్వహించారు. ఏడు నియోజకవర్గ కేంద్రాల్లో వేలాది మందితో ర్యాలీలు చేపట్టారు. దగా ప్రభుత్వ తీరును ఎండగడుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

- విజయనగరం జిల్లా కేంద్రంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం ర్యాలీకి వేలాది మంది హాజరయ్యారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనపై నిరసన గళం వినిపించారు. స్థానిక సీఎంఆర్ కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ సాగింది. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్‌కు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఎంపీపీ మామిడి.అప్పలనాయుడు, జెడ్పీటీసీ కెల్ల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు పాల్గొన్నారు.
- చీపురుపల్లి నియోజకవర్గ కేంద్రంలో జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతమైంది. చీపురుపల్లి పట్టణంలోని ఆంజనేయపురం పెట్రోల్ బంక్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా మూడురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు హాజరైన ర్యాలీలో దాదాపు 5 వేల మంది కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలన, ఇచ్చిన హామీలు అమలుచేయక పోవడం తగదంటూ తహసీల్దార్ ఎస్.రాజారావుకు వినతి పత్రం అందజేశారు.
- గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వెన్నుపోటు దినం ర్యాలీ సాగింది. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో సాగిన ర్యాలీలో పార్టీ శ్రేణులు, ప్రజలు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. తక్షణమే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ పథకం, మహిళలకు ఉచిత బస్సు వంటి హామీలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఐదు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, నాయకులు పాల్గొన్నారు.
- నెల్లిమర్ల నియోజకవర్గంలోని పూసపాటిరేగ పోస్టాఫీస్ నుంచి ప్రారంభమైన వెన్నుపోటు దినం ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది.అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. కూటమి మోసపూరిత పాలనపై తహసీల్దార్ తాడ్డి గోవింద్‌కు వినతిపత్రం అందజేశారు.





బొబ్బిలిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

మేనిఫెస్టో అంటే లెక్క లేదు..



ఎన్నికల మేనిఫెస్టో అంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లెక్క లేదు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడిచారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. కాని ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా మారింది.

– బొత్స సత్యనారాయణ, శాసనమండలి విపక్షనేత, మాజీ మంత్రి



చీపురుపల్లి మూడురోడ్ల కూడలిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్ససత్యనారాయణ

- రాజాం నియోజకవర్గ కేంద్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి స్పష్టంగా కనిపించింది. రాజాం పట్టణ కేంద్రంలో నిర్వహించిన వెన్నుపోటుదినం కార్యక్రమానికి వేలాదిగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చారు. పాలకొండ రోడ్డులోని సన్‌రైజ్ ఆస్పత్రి నుంచి శ్రీకాకుళం రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎస్.కె.రాజుకు వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి తలే రాజేష్, విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు కిల్లి సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు.
- హామీలను నమ్మి ఓటేసిన ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు రాష్ట్రాన్ని ఏలే హక్కు లేదని, సీఎం డౌన్‌డౌన్ అంటూ ఎస్.కోట నియోజకవర్గ ప్రజలు నినదించారు. ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నేతృత్వంలో ఆకుల డిపో నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో పార్టీ నేతలు శోభాహైమావతి, వేచలపు చినరామునాయుడు, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.
- టీడీపీ కూటమి పాలనలో కష్టాలు, నష్టాలు, అదనపు విద్యుత్ చార్జీలు, ఇంటి పన్నుల భారం తప్ప చేసినది శూన్యమని ప్రజలు విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో సాగిన వెన్నుపోటు దినం ర్యాలీలో పాల్గొని కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనపై నిరసన తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ శ్రీనుకు వినతి పత్రం అందజేశారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం



ప్రజలను మోసగించడం, అబద్ధాలతో వంచించడం సీఎం చంద్రబాబు నైజం. సూపర్‌సిక్స్ పథకాలతో జనాన్ని నమ్మించి మోసం చేశారు. 40 ఏళ్ల అనుభవం ఉందన్న చంద్రబాబు రాజకీయ చరిత్ర చూస్తే విశ్వసనీయత అనేదే లేదన్నది స్పష్టం అవుతుంది. జగనన్న పాలనలో సాగిన సంక్షేమ, అభివృద్ధి పాలన కూటమి ప్రభుత్వంలో కుంటుపడింది.

– బొత్స అప్పలనరసయ్య, మాజీ ఎమ్మెల్యే, గజపతినగరం

వెన్నుపోటు రాజకీయాలు చంద్రబాబుకే సాధ్యం



వెన్నుపోటు రాజకీయాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యం. నాడు ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి అధికారం దక్కించుకున్న చంద్రబాబు నేడు ఆంధ్రరాష్ట్ర ప్రజలను నమ్మించి వెన్నుపోటు పొడిచారు. ఈ విషయంలో ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు స్పందించకపోయినా రాష్ట్ర ప్రజలు మాత్రం తగిన బుద్ధి చెప్తారు.

– కోలగట్ల వీరభద్రస్వామి, ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్

మోసాలపై నిలదీత



అబద్ధపు హామీలిచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీనిపై ప్రజలు నిలదీసే సమయం ఆసన్నమైంది. వెన్నుపోటు దినంకు హాజరై ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన గళం వినిపించారు. ముందుముందు మరిన్ని పోరాటాలు తప్పవు. కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలనపై వైఎస్సార్ సీపీ పోరాటం సాగిస్తుంది.

– డాక్టర్ తలేరాజేష్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి



టీడీపీ అక్రమాలకు కొమ్ముకాస్తున్న బీజేపీ



కూటమి ప్రభుత్వంలో భాగమైన బీజేపీ కూడా ప్రజా సంక్షేమం గురించి ఆలోచించడం లేదు. టీడీపీ చేపడుతున్న రెడ్‌బుక్ పాలన వల్ల ఎంతోమంది ఇబ్బంది పడుతున్నా, బీజేపీ నాయకులు చూసీ చూడనట్లు వ్యవహరించడం సిగ్గుచేటు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకపోడంతో ప్రజల్లో వ్యతిరేకత పెల్లుబుకుతోంది. రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారు.

– బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎంపీ

నమ్మించి 'వెన్నుపోటు'



ఉత్తుత్తి హామీలతో నమ్మించారు. ఓట్లు దండుకున్నారు. తీరా హామీలు అమలు చేయమని అడిగిన జనంపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు. ఇది అన్యాయం. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలుచేయాలి. ప్రజలను సంక్షేమ పథకాలతో ఆదుకోవాలి.

– కడుబండి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే, ఎస్.కోట

కూటమి పాలనలో ప్రజలకు కష్టాలే..



అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ వ్యవస్థను రద్దుచేసి వేలాది మందిని నిరుద్యోగులుగా మార్చింది. ఇప్పుడు ఎండీయూ వ్యవస్థను రద్దు చేసింది. చిరుద్యోగులపై వేధింపులకు పాల్పడుతోంది. ప్రజాసంక్షేమ పథకాలకు కోత పెట్టింది. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు కష్టాలు, నష్టాలే ఎదురవుతున్నాయి. ఏడాది పాలనపై ప్రజావ్యతిరేకత వ్యక్తమవుతోంది.

– శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే

నమ్మించి నట్టేట ముంచారు..



కూటమి నాయకులు ఎన్నికల ముందు అధికారం సాధించడమే ధ్యేయంగా హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా హామీలు అమలుచేయకుండా ప్రజలను నట్టేట ముంచారు. వలంటీర్, ఎండీయూ వ్యవస్థను రద్దుచేసి వేలాదిమంది నిరుద్యోగుల ఉపాధికి గండికొట్టారు. కూటమి పాలనపై ప్రజావ్యతిరేక మొదలైంది. సరైన సమయంలో ప్రజలే బుద్ధిచెబుతారు.

– బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే



ఎస్.కోటలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ర్యాలీ చేస్తున్న కడుబండి శ్రీనివాసరావు



పూసపాటిరేగ: తహసీల్దార్ గోవిందకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు



గజపతినగరం రూరల్: మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో గజపతినగరంలో సాగుతున్న వెన్నుపోటుదినం నిరసన ర్యాలీ



విజయనగరంలో వెన్నుపోటు దినంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు

ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలిద్దాం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- జ్యూట్ సంచులను పంపిణీ చేసిన కలెక్టర్



జ్యూట్ సంచులను పంపిణీ చేసిన కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన జ్యూట్ సంచుల పంపిణీని బుధవారం ప్రారంభించారు. ప్లాస్టిక సంచులు బదులుగా గుడ్డ సంచులు, జ్యూట్ సంచులను వాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మురళి, పర్యావరణ ఇంజనీర్ సరిత, జిల్లా అటవీశాఖాధికారి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా గురువారం నుంచి నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. వనం–మనం పేరిట జిల్లా వ్యాప్తంగా 4 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్సులో డీఆర్‌ఓ మురళి, జిల్లా అటవీ అధికారి కొండలరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

రేపటి నుంచి డీఎస్సీ పరీక్ష

విజయనగరం అర్బన్:

డీఎస్సీ పరీక్షకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. పరీక్ష ఏర్పాట్లపై తన చాంబర్లో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. జూన్ 6 నుంచి 30వ తేదీ వరకు డీఎస్సీ–2025 పరీక్ష జరుగుతుందని, దీనికోసం 36,495 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సీతం కాలేజీ, ఐయాన్ డిజిటల్, లెండీ ఇంజినీరింగ్, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్, అవంతి కళాశాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు పూటలా పరీక్ష జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగా హాజరుకావాలని, హాల్ టికెట్‌తో పాటు తప్పనిసరిగా ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతీ రోజూ కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

తప్పులు సరిదిద్దుకునే అవకాశం ఉంది

డీఎస్సీ హాల్ టికెట్‌లో ఏమైనా తప్పులు నమోదై ఉంటే సరిదిద్దుకునే అవకాశం ఉందని, వాటి కోసం అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సూచించారు. తప్పుగా నమోదైన అంశానికి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్‌ను చూపించి పరీక్ష కేంద్రం వద్దే సరిచేసుకోవచ్చని చెప్పారు. తప్పులు సరిచేయించుకునే వారు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ మురళీ, డీఈఓ యు.మాణిక్యంనాయుడు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాణి, విజయనగరం ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, సీఐ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరు హెచ్‌డబ్ల్యూఓలను బదిలీ చేయాలి


పాలక రంజిత్ కుమార్

పార్వతీపురం: పదమూడేళ్లుగా ఒకే కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనలు కూడా వర్తించకుండా ఫెవిక్విక్‌లా అంటుకుని ఉన్న ఇద్దరు హెచ్‌డబ్ల్యూఓలను బదిలీ చేయాలని గిరిజన సంక్షేమ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని ఎస్‌కోట, బొబ్బిలి కేంద్రాల్లో గల గిరిజన కళాశాల వసతి గృహాల్లో ఉద్యోగం వచ్చినప్పటి నుంచి ఒకే చోట 13 ఏళ్లుగా హెచ్‌డబ్ల్యూఓలుగా పనిచేస్తున్న ఆ ఇద్దరినీ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు బదిలీ చేయాలని డిమాండ్‌చేయనున్నట్లు తెలిపారు. ఆ ఇద్దరినీ డిప్యుటేషన్ పేరుతో అక్కడే కొనసాగిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. తాజా బదిలీల్లో కూడా మరో ఐదేళ్లు అక్కడే ఉండేలా ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇదే అమలైతే ఒకే చోట 18 ఏళ్లు పనిచేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు. జిల్లా అధికారులకు కూడా వర్తించని నియమాలు, నిబంధనలు వీరిద్దరికే ఎలా వర్తిస్తున్నాయో అధికారులకే ఎరుక అని ఈ ఇద్దరు హెచ్‌డబ్ల్యూఓలను గిరిజన ఆశ్రమ పాఠశాలలకు బదిలీ చేయకపోతే గిరిజన సంక్షేమ సంఘం తరఫున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సెల్‌ఫోన్ల దొంగకు మూడు నెలల జైలు

విజయనగరం క్రైమ్: సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న వ్యక్తిని విజయనగరం గవర్నమెంట్ రైల్వే పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలసకు చెందిన బి.అజయ్ కుమార్ గతంలో పలు రైల్వే ప్లాట్‌ఫాంలలో సెల్‌ఫోన్‌లు బ్యాగులు దొంగతనాలు చేసేవాడని జీఆర్పీ ఎస్సై బాలాజీరావు చెప్పారు. ఈ మేరకు విజయనగరం స్టేషన్‌లో సెల్‌ఫోన్ చోరీ చేస్తుండగా పట్టుకుని కేసు నమోదుచేసి కోర్టులో ప్రవేశపెట్టగా అజయ్ చేసిన నేరం రుజువు కావడంతో విశాఖపట్నం రైల్వేకోర్టు మెజిస్ట్రేట్ అనురాగ్ మూడు నెలల జైలుశిక్ష విధించారని ఎస్సై బాలాజీరావు వివరించారు.

మహిళ మృతదేహం లభ్యం


పెద్దచెరువు ఆచంట గార్డెన్ వద్ద మహిళ మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక బాలాజీ జంక్షన్ సమీపంలోని పెద్ద చెరువు సమీపంలోని ఆచంట గార్డెన్ వద్ద ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించారు. పెద్ద చెరువు ఆచంట గార్డెన్ వద్ద మృతదేహం కనిపించిన వెంటనే వెంటనే స్థానికులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుల్స్‌ను ఘటనాస్థలికి వచ్చి పరిశీలించారు. గుర్తు తెలియని మహిళకు 40 నుంచి 50 ఏళ్లు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆమె నా భార్య..

విజయనగరం పెద్దచెరువు ప్రాంతంలోని ఆచంట గార్డెన్ వద్ద పోలీసులకు లభించిన మహిళ మృతదేహాన్ని గుర్తించి ఆమె తన భార్యేనంటూ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మృతురాలి భర్త చంద్రన్ స్పష్టం చేశాడు. ఈ మేరకు నగరంలోని గంటస్తంభం వద్ద ఉన్న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తన భార్య ఆధార్ కార్డు తీసుకువెళ్లి లిఖిత పూర్వకంగా చంద్రన్ సమాచారం ఇచ్చాడు. భర్త చంద్రన్న ఇచ్చిన సమాచారంతో అనుమానాస్పద మృతి కాదని మతిస్థిమితం లేక ఆమె ఇంట్లోనుంచి వెళ్లిపోయిందని సీఐ శ్రీనివాస్ చెప్పారు.

పిడుగుపాటుతో మహిళ మృతి


మహిళ మృతదేహం

బలిజిపేట: మండలంలోని పలగర గ్రామానికి చెందిన వావిలపల్లి చంద్రమ్మ (57) బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతిచెందింది. పెసర మొక్కలు తీసేందుకు సాయంత్రం నాలుగు గంటల సమయంలో భర్త చిన్నంనాయుడితో పాటు ఆమె పొలానికి వెళ్లింది. కొంత సమయం అయిన తరువాత ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో భార్యాభర్తలు తిరిగి ఇంటికి వస్తుండగా బోలుబంద వద్ద పిడుగుపడడంతో ఆమె అక్కడికి అక్కడే మృతిచెందింది. మృతురాలిని చూసిన భర్త లబోదిబోమన్నారు. దీనిపై వీఆర్‌ఓ మౌనిక రిపోర్టు రాసి అందించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200


ఆర్చరీ శిక్షణలో పూర్ణచంద్

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందనడానికి ఉదాహరణగా నిలుస్తున్నాడు. రామభద్రపురం మండలంలోని కొత్తరేగ కుర్రాడు. ఆర్చరీలో జాతీయస్థాయిలో మంచి ప్రతిభ కనబరుస్తూ దూసుకుపోతున్నాడు. చిన్నతనంలోనే ఆర్చరీ క్రీడలో అపార ప్రతిభ కనబరుస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు.


జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన పూర్ణచంద్‌కు మిఠాయి తినిపిస్తూ అభినందిస్తున్న తల్లిదండ్రులు


పూర్ణచంద్ గెలుచుకున్న మెడల్స్

గురి తప్పని పూర్ణచంద్

- ఆర్చరీలో అద్భుతాలు సృష్టిస్తున్న యువకుడు
- అండర్ 15లో జాతీయస్థాయిలో రాణింపు
- గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించిన క్రీడాకారుడు

రామభద్రపురం: మండలంలోని కొత్తరేగ గ్రామానికి చెందిన కిలపర్తి పూర్ణచంద్ 9వ తరగతి చదువుతూ క్రీడారంగంలో రాణిస్తున్నాడు. జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్ సాధించి దేశంలో జిల్లా కీర్తిని చాటాడు. ఈ కుర్రాడు 7వ తరగతి నుంచే పలుమార్లు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్ షిప్‌లలో పాల్గొని గోల్డ్, బ్రాంజ్, సిల్వర్ మెడల్స్ అందుకుని శభాష్ అనిపించుకున్నాడు. పథకాల్లో అధికశాతం గోల్డ్ మెడల్స్ అందుకుని అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఇటీవల మార్చి నెలలో గుంటూరులో నిర్వహించిన జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో ఎన్‌టీపీసీ సంస్థ ద్వారా అండర్ 15 విభాగంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా పూర్ణచంద్‌ను సంగారెడ్డి జిలా కలెక్టర్ క్రాంతి ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే 2021లో తమిళనాడులోని అండర్ 14 కేటగిరీలో జాతీయ ఇన్‌డోర్ ఆర్చరీ వ్యక్తిగత చాంపియన్ షిప్ గెలుచుకుని గోల్డ్‌మెడల్ సాధించాడు. ఇంకా బాలుర మిక్స్‌డ్ విభాగంలో బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నాడు. 2024లో హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నాడు. కొత్తరేగ గ్రామానికి చెందిన కిలపర్తి మురళీకృష్ణ ప్రథమ సంతానం పూర్ణచంద్. మురళీకృష్ణ హైదరాబాద్‌లో ఉంటూ చిన్న చిన్న వ్యాపారాలతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. పూర్ణ చంద్ అక్కడే ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. 3వ తరగతి నుంచి ఆర్చరీ క్రీడలో రాణించేవాడు. ఆర్చరీ కోచ్ బండి స్వామి వద్ద శిక్షణ పొందుతూ ఆయన సలహాలు, సూచనలతో ముందుకెళ్తున్నాడు. అయా స్థాయిల్లో వివిధ పోటీల్లో పాల్గొని సుమారు 26 మెడల్స్, ట్రోఫీలు దక్కించుకున్నాడు. విద్యలో కూడా తరగతిలో టాప్ 5లో రాణిస్తున్నట్లు తండ్రి మురళీకృష్ణ తెలిపారు. పూర్ణచంద్‌కు మహారాష్ట్రలోని పూణెలో ఉన్న ఇండియన్ ఆర్మీ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్ యాజమాన్యం ఉచిత విద్యతో పాటు ఆర్చరీలో మరింత శిక్షణ ఇచ్చి ఒలింపిక్ క్రీడల్లో పాల్గొనేందుకు తీసుకు వెళ్లారని తెలిపారు.


గోల్డ్ మెడల్ సాధించిన పూర్ణచంద్‌ను సత్కరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి

ఒలింపిక్స్‌లో మెడల్ సాధనే లక్ష్యం..



నేను నా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పలుమార్లు పాల్గొని సుమారు 26 గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించాను. ఇండియన్ ఆర్మీ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్‌లో చదువుతో పాటు ఆర్చరీలో మరింత శిక్షణ పొంది ఒలింపిక్స్‌లో పాల్గొని మెడల్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను.

కిలపర్తి పూర్ణచంద్, ఆర్చరీ క్రీడాకారుడు

ఆనందంగా ఉంది..



నా కొడుకు జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించాడన్న సంతోషం కంటే మహారాష్ట్రలోని పూణెలో ఉన్న ఇండియన్ ఆర్మీ స్పోర్ట్స్' ఇనిస్టిట్యూట్ యాజమాన్యం ఉచిత విద్యతో పాటు ఆర్చరీలో మరింత శిక్షణ ఇచ్చేందుకు తీసుకెళ్లడం మరింత ఆనందంగా ఉంది. 3వ తరగతి నుంచి బాబు ఆర్చరీ అంటే ఇష్టపడేవాడు. కోచ్ బండి స్వామి చక్కని శిక్షణతో పాటు సలహాలు సూచనలు ఇవ్వడంతో మరింత రాటు దేలాడు. అంతర్జాతీయ స్థాయి ఒలింపిక్స్‌లో ప్రథమ స్థానం సాధించి మెడల్ గెలిస్తే మరెంతో సంతోషంగా ఉంటుంది.

కిలపర్తి మురళీ కృష్ణ, పాతరేగ, రామభద్రపురం మండలం

జిల్లాలో కేంద్ర జలశక్తి అభియాన్ బృందం పర్యటన


మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసిన బృంద సభ్యులు

- మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసిన బృంద సభ్యులు

విజయనగరం అర్బన్: జిల్లాలోని జలవనరులను పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకోడానికి కేంద్ర జలశక్తి అభియాన్ బృందం బుధవారం జిల్లాలో పర్యటించింది. తొలుత కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను బృందం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి వారి పర్యటన వివరాలను తెలియజేశారు. జిల్లాలో తోటపల్లి, తారక రామ తీర్థసాగర్ ప్రాజెక్టులను సందర్శిస్తామని, కోటగండ్రేడులో జలజీవన్ మిషన్ లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడతామని కలెక్టర్‌కు తెలియజేశారు. బృందంలో మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ తరుణా దోలియ, కేంద్ర వాటర్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ నిఖిల్ జెఫ్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు శాస్త్రవేత్త డి.అనంతరావులతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, ప్రాజెక్ట్ డీఈఈ గోవింద రావు, తోటపల్లి ఎస్ఈ స్వర్ణకుమార్, ఈఈ అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

వెనుకబడిన జిల్లాకు నిధులు మంజూరు చేయాలి

కేంద్ర జలశక్తి అభియాన్ బృందంతో కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ మాట్లాడుతూ విజయనగరం వెనుకబడిన జిల్లా అని, కేంద్ర ప్రాజెక్టుల కోసం నిధులను కేటాయించాలని కోరారు. తారకరామ తీర్థ సాగర్‌పై బృందానికి వివరిస్తూ ఈ ప్రాజెక్టు కోసం రూ.800 కోట్లతో అంచనా ప్రతిపాదనలు పంపగా రూ.100 కోట్లు మాత్రమే ఇప్పటివరకు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌ఆర్ చెల్లింపులు పెండింగ్ ఉన్నాయని మిగిలిన నిధులు మంజూరు చేస్తే అభివృద్ధికి అవకాశం ఉంటుందని తెలిపారు.

అధికారిక లాంఛనాలతో ఆర్మీ జవాను అంత్యక్రియలు

బాడంగి: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆర్మీ జవాన్ సత్యం మృదేహానికి అధికారిక లాంఛనాలతో బుధవారం అంత్యక్రియలు జరిగాయి. బొబ్బిలి మండలం పారాది సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాడంగి మండలంలోని ముగడ గ్రామానికి చెందిన జవాను తూముల సత్యం మృతిచెందిన విషయం తెలిసిందే. బొబ్బిలిలో శవపంచాయతీ అనంతరం సత్యం మృతదేహాన్ని స్వగ్రామం ముగడ తరలించారు. బుధవారం ఉదయం ఆయన పనిచేస్తున్న దగ్గర నుంచి మిలటరీ అధికారి, పోలీసులు వ్యాన్‌పై ముగడ గ్రామానికి చేరుకుని సత్యం మృతదేహాన్ని పూలమాలలతో అలంకరించి, మృతదేహంపై జాతీయజెండా అవగతం చేసి గాలిలోకి కాల్పులు జరిపి గౌరవవందనం చేశారు. అనంతరం అంత్యక్రియలకు శ్మశానానికి పోలీసులే మృతదేహాన్ని మోసుకుని వెళ్లారు. అంతకుముందు భార్య నాగరత్నానికి దహన సంస్కారాల కోసం ప్రభుత్వం సమకూర్చిన నగదును అందజేశారు. ఆమె కుమార్తె హిమబిందుతో కలిసి మృతదేహాన్ని కడసారిగా చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు.


సైనికుడు సత్యం మృతదేహాన్ని అంత్యక్రియలకు సిద్ధం చేసిన ఆర్మీ సిబ్బంది

కుమారుడు అరవింద్ తండ్రికి తలకొరివి పెట్టగా దహన సంస్కారాలు పూర్తిచేశారు. మృతుడి అన్నదమ్ములతో పాటు బంధువులు, ప్రజలు పెద్దసంఖ్యలో గుమిగూడి నివాళులర్పించారు. తహసీల్దార్ సుధాకర్, ఎస్సై తారకేశ్వరరావు, వీఆర్‌ఓ దేవి, కార్యదర్శి సూర్యారావు ప్రభుత్వం తరఫున హాజరయ్యారు.

రక్తహీనతతో ఎవరూ బాధ పడకూడదు


ఎమ్మార్ నగరంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: జిల్లాలోని ఏ ఒక్కరూ రక్తహీనతతో బాధపడకూడదని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం మండలం ఎమ్మార్‌నగరం గ్రామ సచివాలయంలో నిర్వహించిన రక్తహీనత నివారణ కమిటీ (అనీమియా యాక్షన్ కమిటీ)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి సచివాలయం పరిధిలో అనీమియా యాక్షన్ కమిటీ సమావేశాన్ని ప్రతి నెలా మొదటి బుధవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. గర్భిణులు, డెలివరీ కేసులను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలని, అలాగే గర్భిణులకు చేయాల్సిన నెలవారీ పరీక్షలు, ప్రసవం అనంతరం పసిపిల్లలకు సమయానుకూలంగా ఇవ్వాల్సిన ఇంజక్షన్లు తదితర వాటిని ఏఎన్‌ఎంలు బాధ్యతాయుతంగా చేయాలని ఆదేశించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

అనీమియా లోపంతో బాధపడుతున్న వారిపట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని వైద్య సిబ్బందిని కలెక్టర్ హెచ్చరించారు. అనీమియా నివారణకు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సక్రమంగా పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం ప్రజలతో కలిసి టీబీ వ్యాధి పట్ల శ్రద్ధ వహించండి, టీబీ రహిత భారత్‌కు సహకరించండి అనే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా.ఎం.వినోద్ కుమార్, తహసీల్దార్ వై.జయలక్ష్మి సీడీపీఓ బి.శ్రీనివాసరావు, డాక్టర్ పి.గోపాల్ కృష్ణ, సర్పంచ్ త్రినాథ రావు, వైద్యసిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కారును ఢీకొట్టిన వ్యక్తి

బొబ్బిలి: పట్టణంలోని ఐటీఐ కాలనీ వద్ద పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కారును అదే జిల్లా మక్కువకు చెందిన వ్యక్తి వెనుక నుంచి ఢీకొట్టాడు. కలెక్టర్ కారు బుధవారం విజయనగరం వైపు వెళ్తుండగా మక్కువ బీసీ కాలనీకి చెందిన నానిబాబు స్పీడ్ బ్రేకర్‌ల వద్ద స్లో చేయకుండా వచ్చి ఢీకొట్టాడు. దీంతో తహసీల్దార్ ఎం. శ్రీనుకు కలెక్టర్ సమాచారం ఇవ్వగా ఆయన ఆర్ఐ రామ్ కుమార్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రామ్‌కుమార్, ఏఎస్సై ఆదిత్యులు ఘటనా స్థలానికి చేరుకుని నిర్లక్ష్యంగా కారును ఢీకొన్న వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి పంపేశారు.

ర్యాపిడ్ కిట్లే దిక్కు..!

- ఇంకా సరఫరా కాని ఆర్‌టీపీఎస్ కిట్లు
- పలు జిల్లాల్లో పెరుగుతున్న కోవిడ్ కేసులు

విజయనగరం ఫోర్ట్: కోవిడ్ వ్యాధి తీవ్రత ఏవిధంగా ఉంటుందో ప్రజలం దరికీ తెలుసు, కరోనా సోకితే చాలా ఇబ్బంది పడతారు. కరోనా వ్యాధికి సకాలంలో చికిత్స చేయించుకోకపోతే ప్రాణాలు మీదికి వచ్చే ఆస్కారం ఉంది. నాలుగేళ్ల కిందట కోవిడ్ వ్యాధి యావత్ ప్రపంచాన్ని తీవ్రంగా వణికించింది. దీంతో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కూడా విధించారు. లాక్ డౌన్ కారణంగా ప్రజలు అంతా ఇళ్లకే పరిమితమయ్యారు. ఇప్పటికీ అ రోజులు తలుచుకుంటే ప్రజలు వణికిపోతారు. కొద్ది రోజులుగా కరోనా వ్యాప్తి మళ్లీ మొదలైంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికే కరోనా కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. కోవిడ్ వ్యాప్తిని అరికట్టేందుకు కరోనా లక్షణాలు ఉన్న వారందరికీ పరీక్షలు చేయాల్సి ఉంది. కోవిడ్‌కేసులు ఎక్కువవుతున్నప్పటికీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాకు రాని ఆర్‌టీపీసీఆర్ కిట్లు

కరోనా వ్యాధి కచ్చితమైన నిర్ధారణ ఆర్‌టీపీసీఆర్ పరీక్ష ద్వారా అవుతుంది. గతంలో కూడా ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేసి కోవిడ్ రోగులను నిర్ధారించేవారు. అంతటి ప్రాధాన్యం గల ఆర్‌టీపీసీఆర్ పరీక్షల కిట్‌లను కూటమి ప్రభుత్వం ఇంతవరకు జిల్లాకు సరఫరా చేయలేదు. దీంతో ప్రభుత్వ తీరుపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ర్యాపిడ్ కిట్ ద్వారా కోవిడ్ టెస్టు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

ర్యాపిడ్ కిట్లతో కోవిడ్ పరీక్షలు

కోవిడ్ లక్షణాలు ఉన్న వారికి ర్యాపిడ్ కిట్లతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో రోగుల్లో వ్యాధి నిర్ధారణ కచ్చితంగా తెలుస్తుందో తెలియదోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కోవిడ్ లక్షణాలు ఉన్న వారికి ర్యాపిడ్ టెస్టింగ్ కిట్ల ద్వారా కరోనా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ల్యాబొరేటరీలను రోగులు ఆశ్రయిస్తున్నారు. సొంత డబ్బులతో ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేసుకుంటున్నారు.

ఆర్‌టీపీసీర్ కిట్లు వస్తాయి

కోవిడ్ లక్షణాలు ఉన్న వారికి ప్రస్తుతం ర్యాపిడ్ కిట్లుతో పరీక్ష చేస్తున్నాం. ఆర్‌టీపీసీఆర్ కిట్లు ఒకటి, రెండు రోజుల్లో జిల్లాకు వస్తాయి.

డాక్టర్ ఎస్.జీవనరాణి, డీఎంహెచ్‌ఓ

పుడమి పరవశించాలి

- పచ్చదనం ఫరిడవిల్లాలి
- ప్రకృతితో సహజీవనమే పర్యావరణ పరిరక్షణ
- నేడు పర్యావరణ దినోత్సవం


విజయనగరం గంటస్తంభం: ధరణీమాత భగభగ మండుతోంది. కన్నబిడ్డలు చేస్తున్న అకృత్యాలు భరించలేక ఆవేదన చెందుతోంది. లక్షలకొద్దీ హిరణాక్ష్యులను చూసి తల్లడిల్లుతోంది. భూమాత పెడబొబ్బలు మనకు వినబడవు. వాహనాల రొద వాటిని మింగేస్తోంది. ధరణి కన్నీరు కారుస్తోంది. మనకు కనబడదు. ఫ్యాక్టరీల పొగమబ్బులు కమ్ముకున్నాయి. అభివృద్ధి ముసుగు వేసుకున్న రక్కసి వికట్టాట్టహాసం చేస్తోంది. అన్నిటికీ ఒకటే సమాధానం గ్లోబల్ వార్మింగ్. ఇప్పుడు మానవాళి మేలుకోవాల్సిన సమయం వచ్చింది. ఉపేక్షిస్తే ఆ తల్లి మహోగ్రరూపం దాలుస్తుంది. అప్పుడంతా ప్రళయమే.

మన కాళ్లకింద వెయ్యి టన్నుల న్యూక్లియర్ బాంబులున్నాయి. వందల కొద్దీ హైడ్రోజన్ బాంబులున్నాయి. అవి ఏ క్షణంలోనైనా పేలవచ్చు. అదే జరిగితే భూమీమీద ఉన్న సమస్త జంతుజాలం, చెట్లు చేమలు నాశనమవుతాయి. భూమి ఓ మరుభూమిగా మారిపోతుంది. నివాసయోగ్యంగా లేని గ్రహంగా మిగిలిపోతుంది. ఇది మండిపోతున్న ధరణి భవిష్యవాణి. మనం చేసే తప్పిదాలకు ప్రకృతి అప్పుడప్పుడు తన ఉగ్రరూపాన్ని చూపిస్తున్నా అదిచ్చే ప్రమాద సంకేతాలను గుర్తించలేకపోతున్నాం. అసలు భూమాతను పరిరక్షించుకోవాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలన్న ఆలోచన ఇప్పుడొచ్చిందేమీ కాదు.అర్ధశతాబ్దం కిందటే ఐక్యరాజ్యసమితి పర్యావరణ పరిరక్షణ కోసం నడుం బిగించింది. సమితి జనరల్ అసెంబ్లీ జూన్ 5, 1972న పర్యావరణ దినోత్సవాన్ని ఏర్పాటు చేసింది. ప్రతి ఏడాది ఇదేరోజున ఏదైనా ఓ నగరంలో అంతర్జాతీయ సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని ప్రజలు, ప్రభుత్వం గుర్తించి తగు చర్యలు చేపట్టేలా ప్రోత్సహించడమే పర్యావరణ దినోత్సవ ముఖ్య ఉద్దేశం. ఇక అప్పట్నుంచి ప్రతి ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటూ వస్తున్నాం. విషపూరిత వాయువులు వాతావరణంలో ఎక్కువ కావడంతో క్రమంగా భూమి కేడెక్కుతోంది. అడవులు, జలవనరులు తగ్గిపోతున్నాయి.


2025 థీమ్ "బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్"

2025 థీమ్ "బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్"

2025లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న జరుపుకుంటారు. ఈ సంవత్సరం థీమ్ ''ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయండి'' ప్లాస్టిక్ కాలుష్యం వల్ల పర్యావరణానికి, జీవులకు కలిగే నష్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, దీనిని అంతం చేయడానికి కృషి చేయడం.


ప్లాస్టిక్ నిర్మూలన అవసరం-పచ్చదనం ముఖ్యం

ప్లాస్టిక్ భూతం..తరిమేద్దాం

భూమిని పట్టిపీడిస్తున్న ప్రమాదకర వస్తువు ప్లాస్టిక్. 100 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. వ్యాపారులు మాత్రం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్‌ను కొంతమంది వ్యాపారులు రోడ్డుపైనే తగులబెడుతున్నారు. దీనివల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో రోజుకు 150 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. విజయనగరం పట్టణంలో సేకరించిన చెత్త నుంచి ఎరువు, ఇంధనం తయారుచేసే ప్రతిపాదనలు ఉన్నా కార్యరూపం దాల్చడం లేదు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

మొక్కలు నాటి సంరక్షించాలి



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలి. ఈ సంవత్సరం జిల్లాలో 20 లక్షలు మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నాం. మొక్కల పెంపకం వల్ల పర్యావరణం సమతుల్యత పెరిగి మానవ మనుగడకు ప్రాణాధారం అవుతాయి. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి. స్వచ్ఛమైన, ఆహ్లాదరకమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలి.

ఆర్.కొండల రావు, జిల్లా అటవీ శాఖ అధికారి

టన్ను పీడీఎస్ బియ్యం పట్టివేత

- డీలర్ల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టిన నాలుగు రోజుల్లోనే బట్టబయలైన అక్రమరవాణా
- రేషన్‌షాపు నుంచి అక్రమమార్గంలో రైస్ మిల్లులకు తరలింపు
- డీలర్లకు వరంలా మారిన రేషన్ పంపిణీ పాతవిధానం

బొండపల్లి: గతప్రభుత్వం పారదర్శకంగా, ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టిన సంగతి విదితమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటి రేషన్ సరుకుల పంపిణీకి మంగళం పాడాలని మొదటి నుంచి ఆలోచన చేస్తూ అందుకు అనుగుణంగా ఏడాది వరకు కొనసాగించి జూన్ నెల నుంచి రేషన్ షాపుల్లో డీలర్ల ద్వారానే రేషన్ సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టి అమలు చేయడం ప్రారంభించింది. అందులో భాగంగా రేషన్ షాపుల డీలర్లు, గతంలో అక్రమంగా రేషన్ బియ్యం ఇతర సరుకులను బ్లాక్ మార్కెట్‌లోకి తీసుకువెళ్లి సొమ్ము చేసుకున్న వారు..తమ పాత అక్రమాలకు మళ్లీ పాల్పడుతూ పేద ప్రజలకు అందాల్సిన రేషన్ సరుకులను పక్కదారి పట్టించే పనిలో నిమగ్నమయ్యారు.

నాలుగు రోజులకే అక్రమ రవాణా

రేషను సరుకులను డీలర్ల ద్వారా పంపిణీని కూటమి ప్రభుత్వం ప్రారంభించి నాలుగు రోజులు కూడా పూర్తి కాకముందే, డీలర్లు, అక్రమాక్కులు కుమ్మక్కై అక్రమ మార్గంలో రేషన్ సరుకులను తరలించే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా విజయనగరంలోని గుంకలాం నుంచి గొట్లాం బైపాస్ రోడ్డు మీదుగా గజపతినగరం తరలిస్తున్న టన్ను పీడీఎస్ బియ్యాన్ని బుధవారం వేకువజామున విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలంతో పాటు సివిల్ సప్లయిస్ డీటీ కె.తిరుపతిరావు అధికారులతో కలిసి పట్టుకుని బొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న బియ్యం విలువ రూ.45వేల 500 ఉంటుందని, ఆటోలో తరలిస్తుండగా ఆటో యజమాని గేదేల ఈశ్వర్రావుతో పాటు సహాయకుడు దాసరి శ్రీనును అదుపులోకి తీసుకుని విచారణ చేయగా గజపతినగరానికి చెందిన ముప్పిడి గణేష్‌కు బియ్యం తరలిస్తున్నట్లు తెలపడంతో అక్రమ రవాణాకు పాల్పడుతున్న అందిరినీ అదుపులోకి తీసుకుని వారిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


అక్రమార్కులతో పాటు పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయిస్ అధికారులు

సాక్షి క్లాసిఫైడ్స్

ASTROLOGY

■ శ్రీ గాయత్రి జ్యోతిష్యం : గత 25 సం॥లుగా VZMలో స్థిరపడి ఉన్నారు. విద్యా, ఉద్యోగం, వివాహం, సంతానం, ఆరోగ్యం మీకు ఎటువంటి సమస్యలు ఉన్నా జ్యోతిష్యం చెప్పబడును. ఫోన్ : 97017 78711 [V- 2027]

WANTED

■ కేర్ టేకర్స్ (M/F), నర్సులు, ఆయాలు, విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు, అత్యధిక జీతం+వ+భో. ఏజెంట్ కమీషన్ 6 వేలు. ✆ 91608 35559, 78158 35561 [B-83]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7995365999 [HA-15907]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.